క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



దేవాలయ కమిటీకి విరాళం అందిస్తున్న నరసింహారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలో నూతనంగా నిర్మిస్తున్న శివరామ ఆంజనేయస్వామి దేవాలయానికి బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నరసింహారెడ్డి శుక్రవారం దేవాలయ కమిటీకి రూ.2.50 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బుక్క పాండురంగారెడ్డి, గంగవరం మల్లయ్య, వత్తుల నారాయణ, పాపగల్ల రవీందర్, మహేందర్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, యాదయ్య, సుధాకర్, రాములు పాల్గొన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ నిర్వహించారు. శివుడికి పంచామృతాభిషేకంనిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. కుంకుమార్చన, దీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

శంకర్‌నాయక్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

సీనియర్ నేత నర్సింహారెడ్డి



శంకర్ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సింహారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం మండలం కేసీ తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ జాటోత్ శంకర్‌నాయక్ దశదిన కర్మ కార్యక్రమంలో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహారెడ్డి హాజరై నివాళులర్పించారు. శంకర్ నాయక్ అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరన్నారు. మహేశ్వరం, కేసీ తండా, ఎన్డీ, దయ్యాల గుండు, కావలోనిబాయి తండాల అభివృద్ధిలో శంకర్ నాయక్ కీలకపాత్ర పోషించారని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాటోత్ శశికాంత్ నాయక్, అల్లె కుమార్, దశరథ నాయక్, వత్తుల నారాయణ పలువురు పాల్గొన్నారు.

ఏవీఎన్ రెడ్డిని గెలిపించండి



ప్రచారంలో శ్రీవాణి, నాయకులు

హుడాకాంప్లెక్స్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్.రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. ఈ మేరకు సరూర్‌నగర్‌లోని వివిధ పాఠశాలల్లో బీజేపీ నాయకులతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పరీక్షలకు నెలరోజుల సమయం మాత్రమే ఉందని ప్రణాళిక ప్రకారం చదువుతూ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని కోరారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల తరగతి గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



సర్వోదయనగర్ కాలనీలోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్న పూలకుండీలు

హరిత కార్పొరేషన్ దిశగా అడుగులు

- నర్సరీల్లో జోరుగా మొక్కల సాగు
- అందుబాటులో లక్షకు పైగా వెరైటీ మొక్కలు
- ఈ యేడాది హరితహారంలో నాటేందుకు సన్నాహాలు

మీర్‌పేట: నాడు దిగుమతి... నేడు ఇక్కడే పెంపకం... వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో హరితహారంలో భాగంగా సర్వోదయనగర్ కాలనీ, నందిహిల్స్ ప్రాంతాల్లో అధికారులు మొక్కల పెంపక కేంద్రాల(నర్సరీలు)ను ఏర్పాటు చేయడం జరిగింది. అటవీశాఖ అధికారి నిరంతర పర్యవేక్షణలో పలురకాల జాతులకు చెందిన మొక్కల పెంపకం ఇక్కడే చేపడుతున్నారు. కార్పొరేషన్‌లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు 10శాతం నిధులు గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తూ నర్సరీల ఏర్పాటుతో పాటు కాలనీల్లోని పార్కులు, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి ట్రీపార్కులను ఏర్పాటు చేస్తున్నారు. నర్సరీల్లో ప్రస్తుతం వివిధ రకాల మొక్కలు దాదాపు లక్షకు పైగా అందుబాటులో ఉన్నాయి.

సిద్ధంగా పూలకుండీలు...

కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారుల మధ్యలో మొక్కల ఏర్పాటు కోసం అధికారులు ప్రత్యేకంగా పెద్ద పరిమాణంలో ఉండే పూల కుండీలను ఇప్పటికే తెప్పించి సిద్ధంగా ఉంచారు. ఈ కుండీల్లో రంగు రంగుల పూల మొక్కలు ఆకట్టుకునే విధంగా ఉంటాయని, త్వరలోనే వీటిని ఆర్‌సీఐ రహదారి డివైడర్‌పై ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



కార్పొరేషన్‌లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. నర్సరీల్లో పలు రకాల మొక్కల పెంపకం చేపడుతూ ఇళ్లలో ప్రజలకు అవసరమైన పూలు, పండ్లు, ఇతర రకాల మొక్కలను పంపిణీ చేస్తున్నాం. హరితహారంలో నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు సంరక్షిస్తున్నాం. హరితహారంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. ఈ యేడాది పెద్ద ఎత్తున మొక్కలు నాటుతాం.

– సీహెచ్.నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోండి

డీఈఓ కార్యాలయంలో ఏబీవీపీ నేతల ఫిర్యాదు



వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: అనుమతులు లేకుండా శ్రీచైతన్య పేరుతో కొనసాగుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరాములు, జిల్లా కన్వీనర్ సాయిచరణ్ మాట్లాడారు. మండల కేంద్రంలో గౌతమి పాఠశాల స్థానంలో శ్రీచైతన్య టెక్నో పాఠశాల పేరుతో ఫ్లెక్సీలు కట్టి విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ సరైన అర్హతలు లేని వారితో బోధన చేపడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అనిల్‌కుమార్, శివ పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి వంటల పోటీలు



వంటకాలను పరిశీలిస్తున్న మేయర్ దుర్గ

మీర్‌పేట: మహిళా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్‌కు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై వంటకాలను పరిశీలించి రుచి చూశారు. ఉత్తమ వంటకాలను ఎంపిక చేసి వారోత్సవాల్లో చివరి రోజున బహుమతులు అందజేస్తామని కమిషనర్ నాగేశ్వర్ తెలిపారు. ఈ పోటీల్లో పిండి, చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షీటీం అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఇబ్రహీంపట్నం డివిజన్ షీటీం సభ్యులు శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గమనించాల్సిన అంశాలను వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టాల్సిన విషయాలు, అసభ్యంగా ప్రవర్తించే వారిపట్ల ఎలా వ్యవహరించాలి, సైబర్ క్రైమ్, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. అత్యవసర సందర్భాల్లో 100కు డయల్ చేయాలని సూచించారు. వాట్సాప్ నంబర్ 9490617111కు వివరాలు పంపవచ్చన్నారు. మహిళా కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసుగుచెందారు

బీజేపీ నేత అందెల శ్రీరాములు



అందెల సమక్షంలో బీజేపీలో చేరుతున్న నేతలు

బడంగ్‌పేట్: సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనతో ప్రజలు విసుగుచెందారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గాంధీనగర్‌కు చెందిన పలువురు మహిళలు, ఇతర పార్టీలకు చెందిన వారు మహేందర్ ఆధ్వర్యంలో నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో అందెల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి బీజేఊపీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ నియంతృత్వ పోకడ వల్ల అమర వీరుల కుటుంబాలు ఘోస పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు, నిరుద్యోగభృతి లేక తెలంగాణ యువత నిరాశనిస్ప్రహలో ఉన్నారన్నారు. భవిష్యత్ తరాలకు బీజేపీతోనే భరోసా ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

బీఆర్‌ఎస్ నేతలకు బీజేపీ నేత వీరేందర్‌గౌడ్ హితవు



సమావేశంలో మాట్లాడుతున్న తూళ్ల వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: మంఖాల్ (ఈ-సిటీ) శ్రీ ఆదిలక్ష్మి అలివేలుమంగా సమేతా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ ఇటీవల నిర్మించిన ప్రహరీని ఈనెల ఆఖరి లోపు స్వచ్ఛందంగా తొలగించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ హెచ్చరించారు. తుక్కుగూడ మున్సిపాలిటీ శ్రీనగర్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఆలయానికి ఉన్న భూమిలో నాలుగు వైపులా 100 అడుగులు దారి కోసం ప్రహరీ నిర్మించిడం ద్వారా దేవాలయానికి ఉన్న భూమిలో 16 ఎకరాల భూమిని కోల్పోవడం జరుగుతుందన్నారు. ఎవరి స్వలాభం కోసం నాలుగు వైపులా రోడ్లు వదిలి ప్రహరీ నిర్మిస్తున్నారని అధికార పార్టీ నాయకులను ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే మా పార్టీ నాయకులు సగం గోడను కూల్చివేయడం జరిగిందన్నారు. మూడేళ్ల నుంచి వైభవంగా జరుగుతున్న స్వామివారి తిరుకల్యాణోత్సవ వేడుకలను కూడా బీఆర్‌ఎస్ నాయకులు పూర్తిగా రాజకీయం చేయడం జరిగిందన్నారు. దీనికి కారణం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అని ఆరోపించారు. మంత్రి గారు ఆలయాల వద్ద రాజకీయం చేయకుండా అభివృద్ధి పైన రాజకీయం చేయాలని ఆయన సూచించారు. రాజకీయాలను పక్కన పెట్టి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, కౌన్సిలర్లు బోధ యాదగిరిరెడ్డి, బాకి విలాస్, నాయకులు జపాల సుధాకర్, బాదావత్ శ్రీనివాస్‌నాయక్, కాటం భాస్కర్‌గౌడ్, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల సమస్య పరిష్కరిస్తాం

బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



హోటల్ నిర్వాహకుడితో మాట్లాడుతున్న ప్రశాంత్ కుమార్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మజీద్‌పూర్ గ్రామంలో చాలాకాలంగా రైతులకు ఇబ్బందికరంగా మారిన సీలింగ్ భూముల సమస్యను ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి సహకారంతో పరిష్కరించే దిశగా కృషి చేస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రగతి నివేదన యాత్రలో భాగంగా శుక్రవారం 48వ రోజు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి చేరుకున్న మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి గ్రామంలో గడపగడపకు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామస్తులకు ఇంకా ఎలాంటి అభివృద్ధి కావాలనే అంశాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంతపల్లి-మజీద్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తారన్నారు. గంగమ్మ,పెద్దమ్మ దేవాలయాలకు వెళ్లేందుకు నిర్మించే రోడ్డు కోసం రూ.5లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.2లక్షలు ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామశాఖ అధ్యక్షుడు ఎడ్ల మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, నాయకులు అశోక్ గౌడ్, జంగమయ్య గౌడ్, శ్రీశైలంగౌడ్, మండల ఉపాధ్యక్షుడు రాజారామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బడా వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు

గ్యాస్ ధరల పెంపుపై బీఆర్‌ఎస్ నేతల నిరసన




నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు

కందుకూరు: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను ఇష్టానుసారం పెంచుతూ పేదల నడ్డి విరుస్తుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి విమర్శించారు. గ్యాస్ ధరల పెంపుపై కేంద్రం వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేసి, కట్టెల పొయ్యిలపై వంట చేసి నిరసన తెలిపారు. మోడీ ప్రభుత్వం పేద ప్రజలను పట్టి పీడిస్తూ దేశ సంపదను అదానీ, బడా వ్యాపారవేత్తలకు దోచిపెడుతుందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ సర్కార్ కూలడం ఖాయమని, కేసీఆర్ నేతృత్వంలోని సర్కార్ అందలం ఎక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, రైతుబంధు మండల అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, సర్పంచ్ సదాలక్ష్మీ, ఎంపీటీసీ కాకి రాములు, డైరెక్టర్ ఆనంద్, మాజీ సర్పంచ్ ఆర్.యాదయ్య, జయమ్మ, సదానంద్‌గౌడ్, పిట్టల యాదయ్య, అమరేందర్‌రెడ్డి, సామయ్య, బర్కం వెంకటేష్, మక్తాల వెంకటేష్‌గౌడ్, పుల్లారెడ్డి, రాజు, మహేందర్, కృష్ణారెడ్డి, పర్వతాలు, తిరుపతిరెడ్డి, లక్ష్మణాచారి, కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కి 18మంది ఎంపిక

మహేశ్వరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి జాతీయ ఉపకారవేతన పథకం(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్) స్కాలర్‌షిప్‌కు 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మహేశ్వరం మోడల్ స్కూల్ నుంచి 12 మంది, తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల-4, మహేశ్వరం బాలుర ఉన్నత పాఠశాల-1, తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల-1 విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతినెల రూ.1000 చొప్పున సంవత్సరానికి రూ.12 వేల ఉపకారవేతనం నాలుగు సంవత్సరాల పాటు రూ.48 వేల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం వరకు ఆర్థిక సహాయం వస్తుంది. పేద విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సహాయం విద్యా ఖర్చులకు ఆసరాగా ఉంటాయి. స్కాలర్‌షిప్‌కి ఎంపికైన విద్యార్థులను ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యా కమిటీ చైర్మన్లు శుక్రవారం అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: తహసీల్దార్



అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న తహసీల్దార్ జ్యోతి

ఆమనగల్లు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమనగల్లు తహసీల్దార్ జ్యోతి కోరారు. ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను, సూపర్‌వైజర్లను తహసీల్దార్ జ్యోతి, ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్, డా.జయశ్రీ, డా.అర్చనారెడ్డి, డా.మంజులాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, వంకాయ 23, బెండ 55, పచ్చిమిర్చి 45, కాకర 44, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 19, దొండ 50, ఆలు 18, ఉల్లి 16, గోకర 45, దోస 35, సొర 15, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 50, ఆర్వి 68, మునగ 55, చిలగడదుంప 40, క్యాప్సికమ్ 50 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి జింకల బావి కాలనీలో సావిత్రిబాయి పూలే సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కల్పన లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళిత, బహుజన పిల్లలకు చదువు చెప్పిన తొలి ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని అన్నారు. సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బేర బాలకిషన్, అరవింద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



షర్మిల సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిన నేతలు

కడ్తాల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు చేయాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ యువజన సంఘాల నాయకులు నరేశ్‌గౌడ్, సాయి, రవికుమార్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ టీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమించాలని, ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలని షర్మిల సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొత్తకుంటతండా నుంచి..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కొత్తకుంటతండాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల సమక్షంలో వైఎస్సార్ టీపీలో చేరారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో శుక్రవారం వైఎస్ షర్మిల సమక్షంలో వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తకుంటతండాకు చెందిన సర్దార్‌నాయక్, హరినాయక్, గోపినాయక్, పవన్‌నాయక్, కుమార్, తులసీరామ్‌లు వైఎస్సార్ టీపీలో చేరారు.

పవన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో హత్యకు గురైన గిరిజన యువకుడు పవన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పవన్ కుటుంబ సభ్యులను వెల్దండ మండలం కేస్లీ తండాలో ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పవన్ హత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని, గిరిజన యువకుడు మరో మతం యువతిని ప్రేమించిన కారణంగానే యువతి కుటుంబ సభ్యులు దారుణంగా హతమార్చారని ఆరోపించారు. హత్యకు గురైన పవన్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు వినోద్, పవన్, మల్లేశ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

టీఎస్‌యూటీఎఫ్

కడ్తాల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్.దుర్గాభవాని పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, జిల్లా కార్యదర్శి భవనేశ్వరి, జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యుడు రాములయ్య, హెచ్‌ఎం జంగయ్య, మండల కార్యదర్శి మల్లయ్యగౌడ్, నాయకులు రాజేశ్, జంగయ్య, కౌసల్య,సునిత, జంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.